
పంచనారసింహులకు నిత్యారాధనలు



నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న పంచనారసింహులను ఆరాధిస్తూ నిత్యారాధనలు, ఆర్జిత కైంకర్యాలను పూజారులు ఆలయ ఆచారంగా కొనసాగించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు మూలవరులను మేల్కొల్పి హారతి నివేదన జరిపారు. స్వయంభువులను కొలుస్తూ నిజాభిషేకం చేపట్టారు. తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. దర్శనమూర్తులకు స్వర్ణ పుష్పార్చన చేపట్టారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ లక్ష పుష్పార్చన కొనసాగించారు. ప్రధానాలయ మహాముఖ మండపంలో శ్రీలక్ష్మీ మండపంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణసేవను మండప ఆవరణలో ఊరేగించారు. రాత్రి స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. దర్బార్ సేవోత్సవం చేపట్టి నిత్యాదాయాన్ని వెల్లడించారు. వివిధ విభాగాల ద్వారా రూ.13,23,604 ఆదాయం చేకూరింది.

ట్రస్టు బోర్డు ఏర్పాటు

సంస్థాన్‌నారాయణపురం, న్యూస్‌టుడే: రాచకొండలోని పురాతన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి యాదాద్రి జిల్లా ఎండోమెంట్ డిపార్టుమెంట్, హైదరాబాద్ ద్వారా సెక్షన్(2) సబ్ సెక్షన్ కింద దేవాలయ ట్రస్టు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి చిట్టెడి వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే 20 రోజులలో హైదరాబాద్, నల్గొండ దేవాలయ శాఖ కార్యాలయాలకు పంపించాలని కోరారు.

ఆ మిల్లులకు కేటాయింపులు లేనట్లే..!

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:



హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లులు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఈసారి ఎట్టి పరిస్థితిలోనూ డిఫాల్ట్ మిల్లర్లకు ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మిల్లర్లకు సబ్ కమిటీ తేటతెల్లం చేసింది. గతంలో సీఎంఆర్ విషయంలో మిల్లర్ల చరిత్రను చూసి ధాన్యం కేటాయింపులు చేయాలనుకుంటోంది. అంటే గతంలో సీఎంఆర్ ధాన్యం తీసుకుని సంవత్సరాలుగా తమ వద్దే ఉంచుకుని డిఫాల్టర్లుగా ఉండి ప్రభుత్వ ఒత్తిడి తరువాత బియ్యం పెట్టిన వారిపై కూడా జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకుంది. ఒకవేళ ప్రభుత్వం దాన్ని కచ్చితంగా అమలు చేస్తే ఈసారి ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 మిల్లులకు పైగా ధాన్యం కేటాయింపుల జాబితాలో ఉండే అవకాశం లేదు. అలా కాకుండా కేవలం గత సంవత్సరం వానాకాలం, యాసంగినే పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ఉమ్మడి జిల్లాలో దాదాపు 37కు పైగా డిఫాల్ట్ మిల్లులను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది.

☛ ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు జరుగుతున్న మిల్లులు 196 ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ మిల్లులకు కేటాయించి వారి నుంచి బియ్యం తీసుకుంటుంది. సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో కొంత కాలం నుంచి మిల్లర్లు వారి ఇష్టానుసారం ప్రవర్తించడంతో ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది.

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్‌లో భాగస్వామ్యం అవుతున్న మిల్లులు

జిల్లా	పచ్చిబియ్యం మిల్లులు	బాయిల్డ్ బియ్యం మిల్లులు
నల్గొండ	22	63
సూర్యాపేట	24	40
యాదాద్రి	12	35

రూ.కోట్లు విలువ చేసే బియ్యం మిల్లర్ల వద్ద ఉండిపోవడంతో పౌరసరఫరాలశాఖ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీని నుంచి బయటపడేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు ప్రారంభించి కొంత మేర విజయవంతమైంది. గతంలో కొంత ధాన్యాన్ని వేలం వేసి అమ్మకాలు చేసిన సంగతి తెలిసిందే. దాని విషయంలోనూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈసారి ధాన్యం కేటాయింపులు జాగ్రత్తగా చేయాలని కృతనిశ్చయంతో ఉంది.

☛ 2019-20 నుంచి 2022-23 వరకు నాలుగు సంవత్సరాల లెక్క ప్రకారం ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 వరకు డిఫాల్ట్ మిల్లులు ఉన్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. గత సంవత్సరం ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాలో వానాకాలంలో 20 మిల్లులు, రబీలో 17 మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం గత చరిత్ర తీసుకుంటే ధాన్యం కేటాయింపులు చేసుకునేందుకు కొత్త మిల్లులకు అవకాశం కల్పించాల్సి వస్తుంది. గత సంవత్సరం మాత్రమే తీసుకుంటే పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన సన్నరకాల ధాన్యాన్ని నేరుగా గోదాముల్లోకి తరలించాలని నిర్ణయించినందున ఇక దొడ్డు రకాల ధాన్యం కేటాయింపులకు ఇబ్బందులు ఏర్పడవని అధికారులు అంటున్నారు.

గురుతర బాధ్యత మీదే..!





రాజపేట మండలంలో నూతనంగా చేరుతున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

సర్కారు బడుల్లో మరింత నాణ్యమైన విద్యాబోధనకు ఎంఈవో పోస్టులు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ వడివడిగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది. డీఎస్సీ-2024 ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన 1,109 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు వారంతా మార్గదర్శకులు కావాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల విధుల్లో చేరిన వివిధ విభాగాల ఉపాధ్యాయులు..

నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
535	322	252

బడి బయటి పిల్లలు బాట పట్టేలా..

చదువుకోవాల్సిన వయసులో పలు కారణాలతో బాలలు బడులకు దూరంగా ఉంటున్నారు. గత జనవరిలో విద్యాశాఖ చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బడి బయట పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా చదువు విలువ తెలిసిన మీరు మీ బడుల పరిధిలో చదువుకు దూరమైన బాలలు బడిలో చేరేలా చూడాలి. తల్లిదండ్రులకు చదువు విలువపై అవగాహన కల్పించాలి. వారి కుటుంబాల్లోని బాలలు పనుల వైపు మళ్లకుండా అక్షర జ్ఞానం కల్పిస్తే వారి గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారు.



నూతన ఒరవడితో పాఠాల బోధన..

కొత్త ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే పోటీ ప్రపంచంలో రాణిస్తున్నారు. మీ పరిధి విద్యార్థులు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పలు సామర్థ్య పరీక్షల్లో వెనుకంజలో నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. బడుల్లో కృత్యాధార బోధన అమలు చేస్తున్నా.. పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు.

★ కొత్తగా చేరిన మీరు సిలబస్ పూర్తి చేశామా.. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశామా.. అన్న దానికే పరిమితం కావొద్దు. మీరు చెప్పింది విద్యార్థులు ఎంతవరకు అర్థం చేసుకున్నారు, వారు ఏం నేర్చుకున్నారు అనే దానిపై దృష్టి పెడితేనే మీ బోధనకు సార్థకత. కృత్యాధార బోధనకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో బోధన పరికరాలు తయారు చేసుకుని నూతన ఒరవడితో బోధన సాగిస్తే విద్యార్థులకు ప్రయోజనం.

స్మార్ట్‌ఫోన్‌ల కంటే పుస్తక పఠనం అలవాటు చేయాలి..



స్మార్ట్‌ఫోన్‌లకు అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. మీ పరిధి విద్యార్థులు చరవాణులకు బానిసలు కాకుండా వారికి మంచి అలవాట్లు నేర్పించండి. పాఠాలు చదవడానికే పరిమితం చేయకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, మంచి సాహిత్యం చదివేలా ప్రోత్సహించండి. చదువు తరువాత ఆటపాటలు, మంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడినవారు అవుతారు.

★ మీ బడిలో చదివే విద్యార్థులకు మీరున్నారన్న భరోసానివ్వండి. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు.. క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మగౌరవం నేర్పించడంపైన దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. అప్పుడే మీరు ఉపాధ్యాయ వృత్తికి పరిపూర్ణత తెచ్చిన వారు అవుతారనడంలో సంశయం లేదు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

వలిగొండ, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అక్కాచెల్లెళ్ల చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం నాసిరకమైన చేప పిల్లలను పంపిణీ చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మేలు రకమైన నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేస్తోందన్నారు.



వలిగొండ అక్కాచెల్లెళ్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ, వలిగొండ అధ్యక్షుడు సోమనబోయిన సతీశ్, మాజీ ఎంపీపీ నూతి రమేశ్‌రాజు, పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, తుమ్మల యుగేందర్‌రెడ్డి, బాతరాజు బాలనర్సింహ, వాకిటి అనంతరెడ్డి, గరిసె రవి, ఐటిపాముల రవీంద్ర, చిలుగూరి సత్తిరెడ్డి, బోళ్ల శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, సయ్యద్, కొండూరు సాయి పాల్గొన్నారు.

చేనేత కళను ప్రశంసించిన విదేశీయులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చేనేత కళను అధ్యయనం చేసేందుకు బ్రిటన్ దేశీయులు చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెంని గురువారం సందర్శించారు. ఆ గ్రామంలో ప్రకృతి రంగులద్ది మగ్గంపై వస్త్రాలు నేసే చేనేత కళాకారుడు దుద్యాల శంకర్ ఇంటిని సందర్శించారు. ఆయన ప్రకృతి నుంచి సేకరించిన అడవి పసుపు, సఫాన్ చెక్క, ఇండిగో చెక్కను ఉపయోగించి పలు రకాల రంగులను వారి ఎదుట దారానికి అద్ది ప్రదర్శించారు. రంగులు అద్దిన దారం దండలను వారి మెడలో వేసి సత్కరించారు. ఆ గ్రామంలోని చేనేత సహకార సంఘానికి వెళ్లారు. మగ్గాలపై వస్త్రాలను నేసే విధానాన్ని పరిశీలించారు. సహకార వ్యవస్థ ద్వారా చేనేత కార్మికుల భాగస్వామ్యం గురించి తెలుసుకున్నారు. పత్తి నుంచి తీసిన నూలు దారంతో నేసిన వస్త్రాలను తిలకించారు. చేనేత కళ, ప్రకృతి నుంచి సేకరించిన పదార్థాలతో రంగులు అద్దకం అద్వితీయమని విదేశీయులు బ్లేజ్ క్రిడాన్, బంధిస్ క్రిడాన్, హెన్నియోట్టా రోజ్వెల్‌లు ప్రశంసించారు.



విదేశీయులకు చేనేత వస్త్రంపై ప్రకృతి రంగులు అద్ది చూపిస్తున్న శంకర్

ఆధ్యాత్మిక వాడ.. వృద్ధులకు నీడ

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్ర సందర్శన కోసం వచ్చే భక్తులలో నడవలేని వారితో పాటు వృద్ధులు బ్యాటరీ వాహనాల ద్వారా ఆలయానికి చేరే సదుపాయాన్ని కల్పించిన దేవస్థానం సేద తీరేందుకు సైతం వసతిని కల్పిస్తోంది. వీవీఐపీల వాహనాల పార్కింగ్, లిఫ్ట్ ప్రాంగణంలో సదరు భక్తులు బ్యాటరీ వాహనాల కోసం వేచి ఉండే సమయంలో సేద తీరేందుకు తగు సౌకర్యాలతో వసతి కల్పిస్తున్నామని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



వృద్ధుల సేద కోసం ఏర్పాట్లు

ప్రతిభ వెలికి తీసేందుకే సీఎం కప్: విప్ అయిలయ్య

భువనగిరి, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలు, మత్తుపదార్థాలకు బానిస కాకుండా ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కలెక్టరేట్ ఆవరణ నుంచి సీఎం కప్ టార్చ్ ర్యాలీని కలెక్టర్ హన్మంత్ కె.జెండగేతో కలిసి గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి భువనగిరి కోట వరకూ ర్యాలీ కొనసాగింది. సుమారు 600 మంది విద్యార్థులు, క్రీడాకారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పల్లెల నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీయడానికి సీఎం కప్ చక్కటి వేదిక అవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హన్మంత్ కె.జెండగే మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి శోభారాణి, జిల్లా యువజన, క్రీడల అధికారి ధనంజేయులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ శ్యాంసుందర్, జిల్లా అధికారులు జైపాల్‌రెడ్డి, రమణి పాల్గొన్నారు.



సీఎం కప్ టార్చ్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, చిత్రంలో కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్, పుర ఛైర్మన్ వెంకటేశ్వర్లు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బీబీనగర్, న్యూస్‌టుడే: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. బీబీనగర్, ఇబ్రాయిపల్లికుంటలో గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంట పొలాలను పరిశీలించారు. ప్రభుత్వ సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. అనంతరం బీబీనగర్ ఆర్‌సీఎస్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలని సూచించారు. ఎరువులు, పురుగుమందులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఏవో పద్మ, ఏఈవో ఉమామహేశ్వరి ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించి తనిఖీ చేశారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. రోగులు ఎంతమంది వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జండగే

వన దేవతకు హారతి

ప్రాణవాయువు ప్రసాదిస్తూ మాకు రక్షగా మారావు. కళ్లముందే కనిపించే మహిమాన్వితానివి. నిన్ను కొలిస్తే కలగవా మాకు దీవెనలు, భాగ్యములు. అందుకే నీకు సారె సమర్పించాం.. పూలదండలు వేసి పూజించాం. చల్లగా చూడు భరతమాత అన్నట్లుగా ఉంది కదా చిత్రం చూస్తే. యాదగిరిగుట్టలోని గాంధీనగర్‌లో వేప చెట్టును ఇక్కడి స్థానికులు ఇలా పూజిస్తున్నారు.



–న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట పట్టణం

ఎన్నాళ్లిలా..!

నల్గొండ జిల్లా చింతపల్లి మండలానికి చెందిన 42 ఏళ్ల మహిళ రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారు. క్యాన్సర్ నాలుగో స్థాయికి చేరడంతో బాధితులు జనరల్ ఆసుపత్రి ఆలన వార్డులో చేర్చారు. చికిత్స పొందిన ఆమె పది రోజులకు మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను ఇంటికి తీసుకెళ్లక పోవడంతో రెండు రోజులు పోస్టుమార్టం గదిలో ఉంచి మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు.

వేములపల్లి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళ గర్భాశయ క్యాన్సర్ బారిన పడటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రూ.3.50 లక్షలకు పైగా ఖర్చు చేసినా ఆరు నెలల వ్యవధిలోనే ఆమె మృత్యువాత పడ్డారు.

◆ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే:

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. మహిళల్లో వచ్చే క్యాన్సర్లు భయాందోళనకు గురి చేస్తున్నాయి. బాధితుల సంఖ్య పెరుగుతున్నా.. ప్రత్యేక వైద్యులు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా అందుబాటుల్లో లేక పోవడం గమనార్హం. నల్గొండ, సూర్యాపేటలో వైద్యకళాశాలలు అందుబాటులోకి వస్తే క్యాన్సర్ లాంటి రోగాలకు శస్త్రచికిత్సలు, కీమో థెరపి లాంటి వైద్యం అందుబాటుల్లోకి వస్తుందని ఎదురు చూసిన బాధితుల ఆశలు నీరుగారాయి. ఎలాంటి క్యాన్సర్ లక్షణాలు కన్పించినా స్థానికంగా ఉండే జనరల్ ఫిజీయన్ల సూచనతో మాత్రలు వాడటం, లేదంటే హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.



మహిళలకు ఇబ్బందికరమే..

జిల్లాలో క్యాన్సర్ల బారిన పడుతున్న మహిళల పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు 380 మంది ఉన్నారు. రొమ్ము క్యాన్సర్ బాధితులు 461 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. లెక్కల్లోకి రానివారు కూడా అధికంగానే ఉంటారు.

ఆలన ద్వారా చికిత్స అందిస్తున్నాం:

డా.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, నల్గొండ



జిల్లాలో ఆలన కింద క్యాన్సర్ బాధితులకు అనుభవం ఉన్న ఎంబీబీఎస్ వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నాం. ఎంఎన్‌జేలో చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక వాహనం ద్వారా గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు మాత్రలు అందజేస్తున్నాం. దీంతో పాటు క్యాన్సర్ నాలుగో స్థాయికి వచ్చిన వారికి చికిత్స అందిస్తున్నాం. చివరి జీవితంలో బాధితులు ఇబ్బంది పడకుండా ఇక్కడ చికిత్స అందించడంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం.

ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన క్యాన్సర్ బాధితుల వివరాలు.. (ఈ ఏడాది సెప్టెంబరు వరకు)

	నల్గొండ జిల్లా				సూర్యాపేట				యాదాద్రి			
ఏడాది	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో
2020	536	2,144	155	6.97	390	1,384	129	4.11	195	952	53	2.89
2021	745	2,851	254	7.80	424	1,905	193	4.96	283	1,454	124	4.29
2022	630	3,290	276	8.40	453	2,704	238	5.10	245	1,661	136	4.31
2023	723	4,257	341	7.62	551	3,191	265	5.11	256	2,223	167	3.41
2024	559	3,674	317	6.61	389	2,680	247	2.43	234	1,855	174	2.13

ఇంట్లోనే అల్లి.. రికార్డులకెక్కి


అల్లికల తయారీలో వసంతలక్ష్మి

కోదాడ, న్యూస్‌టుడే: కొందరు మహిళలు ఇంట్లో పనులు చేస్తూనే తమకు నచ్చిన రంగాల్లో రాణించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారిలో కోదాడ పట్టణానికి చెందిన మహంకాళి వసంతలక్ష్మి ఒకరు. కుట్లు, అల్లికల విభాగం పోటీలో గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కడంతో ఇటీవల విశాఖపట్నంలో ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే..

మొదటి స్థానంలో నిలిచి..

కుట్లు, అల్లికల విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల బృందం విశాఖపట్నం కేంద్రంగా ఈ పోటీలను నిర్వహిస్తుంది. గతేడాది డిసెంబరులో ఈ పోటీలను ప్రారంభించి ఈ ఏడాది సెప్టెంబరు 15 వరకు నిర్వహించింది. ఈ పోటీలో పాల్గొన్న మహిళలు గత పది నెలలుగా రకరకాల డిజైన్లను తయారు చేయాలి. నిత్యం ఆన్‌లైన్ విధానంలో మహిళలకు నిర్వాహకులు దిశానిర్దేశం చేస్తుంటారు. రోజుకో డిజైన్‌లో అల్లాల్సి ఉంటుంది. ఈ పోటీలో పాల్గొన్న వసంతలక్ష్మి పోటీలు ముగిసే సమయానికి 500లకు పైగా అల్లికలతో మొదటి స్థానంలో నిలిచి, స్టార్ పర్‌ఫార్మర్ ఆఫ్ ది ప్రాజెక్టుగా ఎంపికయ్యారు. ఉలెన్ దారం సాయంతో అల్లికలు చేస్తారు. ఈ దారం విశాఖపట్నం నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. మిషన్ లేకుండా చేతులతోనే తయారు చేయాలి. ఒక్కో దానికి మూడు గంటల నుంచి పది గంటల వరకు సమయం పడుతుంది. పోటీదారులు తయారు చేసిన అల్లికలను అనాథ పిల్లలకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కుటుంబ సభ్యుల సహకారంతో:

ఈ పోటీలో పాల్గొన్నప్పటి నుంచి రోజూ రకరకాల డిజైన్ల రూపంలో అల్లికలు తయారు చేశా. మా సోదరి విశాఖపట్నంలో ఉంటుంది. ఆమె సాయంతో ఈ పోటీలో పాల్గొని రాణించాను. గిన్నిస్ రికార్డులో చోటు దక్కుతుందని ఊహించలేదు. ఈ అవార్డు సాధించడంలో నా భర్త, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది.

– వసంతలక్ష్మి

అరచేతిలో ఓటరు సమాచారం

★ టీఎస్ఈసీ.జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లో ఓటు వివరాలు



భానుపురి, న్యూస్‌టుడే: కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు.. మార్పులు చేర్పులు చేసుకున్నవారితో పాటు ఇది వరకు ఓటు ఉన్న వారు.. ఓటు చూసుకొనేందుకు జాబితా కోసం వెతుకుతుంటారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల సంఘం వెంటనే ఓటు ఉందో లేదో తెలుసుకొనేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది. ప్రతి ఎన్నికలకు ఎన్నికల సంఘం(ఈసీ) కొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతోంది.

అక్కడ చూసుకోలేని పరిస్థితి..

ఈసారి త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. కానీ చాలామంది అక్కడికి వెళ్లి ఓటరు జాబితా సరిచూసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి రావడంతో ఓటు ఉందో లేదో ఇక్కట్లు పడుతుంటారు. తీరా పోలింగ్ సమయానికి తమ ఓటు ఏమైందని ఆందోళన చెందుతుంటారు. అలాంటి సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత తరుణంలో సాంకేతిక వినియోగం పెరిగిపోయింది. ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. ఎన్నికల సంఘం తీసుకొచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి అరచేతిలోనే చూసుకోవచ్చు.


ఓటర్ల వివరాలు

జిల్లా	ఓటర్లు
సూర్యాపేట	6,83,181
నల్గొండ	10,42,493
యాదాద్రి	5,20,438

తెరిచేదిలా..

ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన వెబ్‌సైట్‌ను చూసుకొనేందుకు ముందుగా గూగుల్‌లోకి వెళ్లి tsec.gov.in అని టైప్ చేయగానే తెలంగాణ ఎలక్షన్ కమిషన్ పేజీ వస్తుంది. ఇందులో ఫైనల్ రోల్స్ జీపీ/వార్డు వైజ్ ఓటరు లిస్ట్ యాజ్ ఆన్ 28.09.2024 అనే ఐచ్ఛికం ఉంటుంది. దీనిని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయాలని మరో పేజీ కనిపిస్తుంది. అనంతరం పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా ప్రత్యక్షమవుతుంది. ఇందులో వార్డుల వివరాలు కూడా ఉంటాయి. మనం ఉండే వార్డుకు సంబంధించిన బాక్సును క్లిక్ చేస్తే అందులో పూర్తి వివరాలుంటాయి.

పచ్చటి కోక ధరించినట్లు.. దృశ్యం ఇట్లుండె..!



వేములపల్లి మండలం మిర్యాలగూడ రోడ్‌లో పొలాలన్నీ పచ్చగా..చూపరులకు కనువిందు చేస్తున్నాయి.. భూమాత పచ్చటి చీర ధరించినట్లు ఉన్న దృశ్యం ఆకట్టుకుంటోంది.. ఈ నెల చివర్లో వరి కోతలు ప్రారంభమవుతాయని గ్రామస్థులు తెలిపారు. - ఈనాడు, నల్గొండ

నల్గొండ బిషప్‌ను కలిసిన మంత్రి


బిషప్ కరణం ధమన్‌కుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, న్యూస్‌టుడే: నల్గొండ డయాసిస్ క్యాథలిక్ బిషప్ కరణం ధమన్‌కుమార్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బిషప్ గురుపట్టాభిషేకం పొంది 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి ఆయనను అభినందించారు. మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. మేత్రాసనానికి అవసరమైన సహాయ, సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. మంత్రితో పాటు పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ, పాదర్ జోసఫ్, పసల శౌరయ, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటపై కష్టాలు మొలకెత్తే..


ఏరివేత కాకముందే వర్షాలకు పత్తి పంట పరిస్థితి ఇలా.

చండంపేట, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలు పత్తి రైతుల పాలిట శాపంగా మారాయి. పత్తి ఏరివేత చేయాల్సిన సమయంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తడిచి పత్తి చెట్ల పైనే మళ్లీ మొలకెత్తే పరిస్థితి వచ్చింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. మొలకెత్తిన పత్తిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. దీంతో వారు చేసేదేమీలేక ఇంటి ఆవరణలో పత్తిని ఆరబెడుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు.

స్వామి దర్శనంతో మానసిక ఆనందం: సుమన్


యాదాద్రి ఆలయ సన్నిధిలో సినీనటుడు సుమన్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో స్వయంభువులుగా కొలువై ఉన్న పంచనారసింహుల దర్శనం మానసిక ఆనందం, ప్రశాంతత కలిగిస్తుందని సినీ నటుడు సుమన్ వెల్లడించారు. కుటుంబ సభ్యులతో ఆయన గురువారం ఈ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహిమాన్విత దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించిందన్నారు. సుమన్ వెంట ఆలయ మాజీ ధర్మకర్త పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ ఉన్నారు. దైవ దర్శనం కల్పించిన ఆలయ అధికారులు, వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. రెండు నెలల అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, పైతాన్ కోర్సుకు డిగ్రీ, బేసిక్ కంప్యూటర్(డాటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్, ఆటోమొబైల్ టూవీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ, వసతి ఉచితంగా ఉంటుందని, శిక్షణ అనంతరం కచ్చితమైన ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న సంస్థ ప్రాంగణంలో ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

తెలంగాణ జట్టు కెప్టెన్‌గా కొయ్యలగూడెం విద్యార్థి


తమిళనాడు జట్టుతో పోటీలో టాస్‌లో పాల్గొన్న తెలంగాణ జట్టు కెప్టెన్ కొయ్యలగూడేనికి చెందిన ఎర్రగుంట అక్షయ్‌కుమార్ (నీలం డ్రెస్)

చౌటుప్పల్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి 32వ జూనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న తెలంగాణ జట్టుకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఎర్రగుంట అక్షయ్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ పోటీలు హరియాణా రాష్ట్రంలోని పానిపట్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. అండర్-19 విభాగంలో హరియాణా రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు ఇతను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 13 మంది సభ్యులున్న తెలంగాణ జట్టుకు కోచ్‌గా వికాస్, మేనేజర్‌గా లతీఫుద్దీన్ వ్యవహరిస్తున్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్, సీఐకి ఛార్జిమెమో..

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మండలంలోని ముల్కలపల్లికి చెందిన రజిత హత్యకేసు నమోదు విషయంలో అవకతవకలకు పాల్పడిన వ్యవహారంలో గురువారం కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్ చేయగా, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు ఛార్జిమెమో జారీ చేశారు. బాధితుల నుంచి డబ్బుల వసూలులో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలున్న కానిస్టేబుల్ సత్యనారాయణను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేయగా, సీఐ ధనుంజయకు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఛార్జిమెమో జారీచేశారు. ఇప్పటికే హత్యకేసును ఆత్మహత్య కేసుగా నమోదు చేసిన ఆరోపణలపై ఎస్ఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హత్య కేసు నమోదు చేయాల్సిన అధికారం సీఐ స్థాయి అధికారికి ఉండగా.. ఈ కేసులో ఆయనకు ఛార్జిమెమోతో సరిపెట్టి బాధ్యత లేని ఎస్ఐ, కానిస్టేబుల్‌పై సస్పెండ్ చర్యలు తీసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

రేషన్ బియ్యం పాలిష్ చేసి అక్రమ రవాణా

★ ఇద్దరి అరెస్టు.. రూ.18 లక్షల సొత్తు స్వాధీనం: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని మిల్లులో పాలిష్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వారి నుంచి రూ.18 లక్షల విలువ చేసే 504.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన చీమకుర్తి సుధాకర్ కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులో పాలిష్ వేయడంతో పాటు నకిలీ బిల్లులు తయారీ చేసి రూ.30 కిలోల చొప్పున నెలకు 10 నుంచి 12 లోడ్‌లను తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వాడపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన లారీతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వాస్తవాలు ఒప్పుకున్నట్లు తెలిపారు.

★ ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ సలావుద్దీన్ అనే లారీ డ్రైవర్ గురువారం లోడు రేషన్ బియ్యంతో వెళుతుండగా పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు పాల్గొన్నారు.

గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

★ అధికారుల తనిఖీలో బహిర్గతం


వీర్లపాలెంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో పురుగు మందులను పరిశీలిస్తున్న డీఏవో శ్రవణ్‌కుమార్, తదితరులు

దామరచర్ల, న్యూస్‌టుడే: ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీల పేరుతో తెలంగాణలో నకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. మిర్యాలగూడతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు.

◆ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మొదట మిర్యాలగూడలోని ఓ ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీ చేయగా ప్రముఖ కంపెనీ పేరుతో గల నకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52,900 విలువైన 11 కిలోల బరువుగల 23 సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడిని ప్రశ్నించగా.. ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు.

◆ డీఏవో మాట్లాడుతూ.. నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొనుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడుతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వ్యవసాయాధికారులు ఫిర్యాదు చేశారు. ఏడీఏ దేవ్‌సింగ్, ఏవో సైదానాయక్ తదితరులున్నారు.

ఊరంతా ఖాళీ..!


పొలాలు వద్ద చెట్ల కింద సేద తీరుతున్న గ్రామస్థులు

వేములపల్లి న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామాన్ని గురువారం గ్రామస్థులందరూ మూకుమ్మడిగా ఖాళీ చేశారు. ఏడాది కాలంగా గ్రామంలో వరుస మరణాలు జరుగుతున్నాయని, ఊరికి కీడు సోకిందనే అనుమానంతో గ్రామపెద్దలు ఒకరోజంతా గ్రామానికి వెలుపల ఉండాలని నిర్ణయించారు. తెల్లవారగానే ఇంటి ముందు కళ్లాపి కూడా చల్లకుండా ఇళ్లకు తాళం వేసి పొలిమేరలో ఏర్పాటు చేసిన నిప్పును తీసుకొని వ్యవసాయ బావులు, భూములు, శివారు ప్రాంతాలకు తరలివెళ్లారు. అక్కడే వంటావార్పు చేశారు. సాయంత్రం తిరిగి ఇంటి బాట పట్టారు. గ్రామంలోని హోటళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు తాళాలు వేయడంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గ్రామంలో మొత్తం 1250 కుటుంబాలుండగా సుమారు 5500 జనాభా నివాసముంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సుమారు 76 మంది పలు కారణాలతో మృతిచెందారు. అందులో 32 మంది యువకులు, 21 మంది 50 ఏళ్లలోపు వారు, 23 మంది వృద్ధులున్నారు. వీరిలో గడిచిన రెండు నెలల్లోనే సుమారు 20 మందికి పైగా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.


నిర్మానుష్యంగా మారిన శెట్టిపాలెం గ్రామం

వైభవంగా గంధం ఊరేగింపు


ఉర్సు గంధం ఊరేగింపులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ తదితరులు

నీలగిరి, న్యూస్‌టుడే: సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం గంధం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. స్థానిక మదీనా మజీద్ నుంచి గంధం ఊరేగింపును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పోలీసు శాఖ తరఫున దర్గాకు సమర్పించే గంధం ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు. గంధం ఊరేగింపుగా మసీదు నుంచి పెద్దగడియారం చౌరస్తా మీదుగా ప్రకాశంబజార్, అంబేడ్కర్ చౌరస్తా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, నెహ్రూగంజ్ నుంచి లతీఫుల్లా ఖాద్రీ దర్గ వద్దకు చేరుకుంది. గుట్ట మెట్ల వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులు గంధం, పంకాలకు స్వాగతం పలికారు. ముతావలీలు గుట్టపైన లతీఫుల్లా ఖాద్రీ దర్గా వద్ద గంధం సమర్పించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుట్టపైకి ఘాట్ రోడ్డు వేయిస్తా: మంత్రి కోమటిరెడ్డి

కుల మతాలకు అతీతంగా తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి లతీఫుల్లా ఖాద్రీ దర్గాను దర్శించుకునే భక్తులు నేరుగా గుట్టపైకి వెళ్లడానికి రూ.30 కోట్లతో ఘాట్‌రోడ్డు నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఉర్సు ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని గౌస్‌నగర్‌లో గురువారం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు(15) భువనగిరిలోని ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న సాయంత్రం గేదెలకు పాలు పితికేందుకు తండ్రితో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పాలకేంద్రంలో పాలు పోసి ఇంటికి తిరిగి వచ్చారు. రాత్రి భోజనం చేసిన అనంతరం కుమారుడు తరచూ ఉమ్ముతుండగా తల్లిదండ్రులు గమనించి ఏమైందని అడగ్గా, వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగానని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తన కుమారుడు ఒంటరిగా దిగాలుగా ఉండేవాడని తండ్రి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

కాల్వలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

త్రిపురారం, న్యూస్‌టుడే: మతి స్థిమితం సరిగా లేక ముదిమాణిక్యం కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపికిషోర్ (57)కు నాలుగేళ్ల నుంచి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చూపించినా పరిస్థితి మారలేదు. అప్పటి నుంచి ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతున్నాడు. ఆ క్రమంలో ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి గురువారం త్రిపురారం మండలం నీలాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఘంటరావుక్యాంపు సమీపంలో ముదిమాణిక్యం కాల్వలో పడి మృతిచెందాడు. విషయం స్థానికులు పోలీసులకు తెలుపగా.. మృతదేహాన్ని మరణోత్తర పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిదీస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ..

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందిన ఘటన పీఏపల్లి మండలం మూనావత్ తండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటన పట్ల గుడిపల్లి ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మూనావత్‌తండాకు చెందిన మూనావత్ మోహన్ కుటుంబానికి, అతని పాలివారైన మూనావత్ బెల్లు, అతని కుమారులు కోటేష్, రమేష్‌తో కొద్ది రోజులుగా భూ వివాదాలున్నాయి. ఈ విషయమై బుధవారం సాయంత్రం మోహన్ కుటుంబానికి, బెల్లు కుమారులు కోటేష్, రమేష్‌లతో వ్యవసాయ పొలం వద్ద గొడవ జరిగింది. తర్వాత కొద్ది సేపటికి మూనావత్ మోహన్ కుమారుడు(13) ఇంట్లో కిటికీకి ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో చదువుతుండగా సెలవుల నిమిత్తం ఇంటి వద్ద ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని మృతి పట్ల మోహన్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్ పరిశీలించారు. ఈ విషయమై మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి అనంతరం రైలు కింద పడి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగు చూసింది. రైల్వే ఎస్సై పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ-కొండ్రపోల్ మధ్య రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలేజీ బ్యాగులో లభించిన ఐడీ కార్డు ఆధారంగా విచారణ చేపట్టి వివరాలు కనుక్కున్నారు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన విద్యార్థి (18).. దసరా సెలవులకు ఇంటికొచ్చి.. తిరిగి కళాశాల హాస్టల్‌కు వెళ్తున్నట్లు తల్లిదండ్రులతో చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామన్నారు.

మృతదేహం పక్కనే పురుగు మందు డబ్బా పడి ఉండడంతో.. అది తాగిన అనంతరం రైలుకు ఎదురెళ్లి బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి శవపరీక్ష అనంతరం తల్లిదండ్రులకు అప్పగించి.. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

వార్డెన్లు ఉండరు.. మెనూ పాటించరు..!

☛ అధికారుల తనిఖీలో వెల్లడి

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరులోని ప్రభుత్వ బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలికల వసతిగృహాలను గురువారం ఉదయం 8 గంటలకే తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, పుర అధ్యక్షురాలు గుర్రం కవిత, పుర కమిషనర్ సి.శ్రీకాంత్‌లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బీసీ బాలుర వసతి గృహంలో 65 మంది విద్యార్థులకు పదిమంది మాత్రమే ఉన్నారు. ఇదే వసతిగృహంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పది మందికి కేవలం ఇద్దరే ఉన్నారు. వార్డెన్ లేకపోగా మెనూ కేవలం పప్పుతో అన్నం వడ్డించారు. ఉదయం ఇవ్వాల్సిన రాగిజావ ఇవ్వలేదు. పప్పు అందరికీ సరిపోక పోవడంతో చారు మాత్రమే పోశారు. వార్డెన్ జ్యోతి లేకపోవడంతో నైట్ వాచ్‌మెన్, వంట మనుషులతో అధికారులు వివరాలు తెలుసుకున్నారు. వార్డెన్ జ్యోతి ఇన్‌ఛార్జిగా ఉన్న బీసీ బాలికల వసతిగృహంలో అసలు పిల్లలే లేరు. ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారు.



బీసీ వసతి గృహంలో నైట్ వాచ్‌మెన్‌తో మాట్లాడుతున్న తనిఖీ బృందం

☛ ఎస్సీ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేయగా వంద మంది బాలికలకు ఏడుగురు మాత్రమే హాజరయ్యారని, అందులో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఐదుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒకరి బదులుగా ఓ మహిళ ఉన్నారు. వసతిగృహాల్లో వార్డెన్లు లేకపోవడం, పిల్లలను రప్పించకపోవడం, మెనూ పాటించకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని తహసీల్దారు రాంప్రసాద్ తెలిపారు. డీఈవోకు నివేదిస్తానని ఎంఈవో గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

క్రీడా కుసుమం

నాన్న ట్రాలీ డ్రైవర్, అమ్మ రోజూ వారి కూలీ రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం అయినా వెనకంజ వేయకుండా చదువుకు పేదరికం అడ్డుకాదంటూ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతూనే రెండు ప్రైవేటు స్కూళ్లలో పీఈటీగా పని చేస్తూ తనలక్ష్యానికి సిద్ధమవుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది బీబీనగర్ పట్టణానికి చెందిన గుర్రం నిఖిత. తాను నేర్చుకున్న క్రీడనే ఉపాధిగా మలుచుకొని చదువుకుంటూ అందరి మన్ననలు పొందుతున్న నిఖితపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– బీబీనగర్, న్యూస్‌టుడే



2022లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతి అందుకుంటున్న నిఖిత

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం..

– గుర్రం నిఖిత

అమ్మా నాన్న పడుతున్న కష్టాలను చూడలేక వారికి తోడ్పాటు నందించాలని పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ డిగ్రీ చదువుకుంటున్నాను. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో పార్ట్ టైం పీఈటీగా ఎంపికవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. అందుకు అనుగుణంగా సాధనచేస్తున్నాను.

బీబీనగర్‌కు చెందిన గుర్రం లక్ష్మారెడ్డి-రేఖారెడ్డిలకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు పెద్దకుమార్తె నిఖిత జూడో కోచ్ షేక్ పర్వేజ్ శిక్షణలో జూడో, కరాటేలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఇంటర్ పూర్తయ్యాక ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో నల్లగొండలోని గౌతమి హైస్కూల్లో పీఈటీగా పనిచేస్తూ భువనగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో చేరింది. ఈ ఏడాది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో పార్ట్‌టైం పీఈటీ పోస్ట్ ఉందని తెలిసి దరఖాస్తు చేసుకుంది. తన ఆత్మస్థైర్యం, పట్టుదల, శ్రమను గుర్తించిన హెచ్‌పీఎస్ పీఈటీ పోస్ట్‌కు ఎంపికచేసింది. హైదరాబాద్‌లో వారానికి రెండు రోజులు, బీబీనగర్ మండలం వెంకిర్యాలలోని సాయిమోహిత్ స్కూల్లో వారానికి రెండు రోజులు పార్ట్‌టైం పీఈటీగా జాబ్‌చేస్తూ చదువును కొనసాగిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తోంది.

సాధించిన విజయాలు కొన్ని..

☛ 2014లో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించింది.

☛ 2015లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం గెలిచింది.

☛ 2016లో కరీంనగర్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది.

☛ 2018లో ఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో, 2022 సంవత్సరంలో కేరళలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అందరి మన్ననలను పొందింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80082 78928 80085 74375

ఆలేరు, న్యూస్‌టుడే:

? ఆలేరు-కొలనుపాక బైపాస్ రహదారి పక్కనే వ్యర్థాలను పారబోస్తుండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. సమీప నివాసాల వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. – జి.రాజేశ్వర్‌గౌడ్, కొలనుపాక

✔ విషయం దృష్టికి వచ్చింది. చెత్తను తొలగించే చర్యలు చేపడతాం. – కె.లక్ష్మీ, పుర కమిషనర్, ఆలేరు.

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే:

? మండల కేంద్రంలోని పాక్స్ కార్యాలయం ఎదురుగా రెండు నెలల నుంచి నీటి పైపు నుంచి నీరు వృథాగా పోతోంది. చర్యలు తీసుకోండి. – డి.ప్రసాద్, ఆత్మకూరు

✔ మిషన్‌భగీరథ పైపు లైనుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. – టి.ఆనంద్, ఆత్మకూరు పంచాయతీ కార్యదర్శి.

తుర్కపల్లి, న్యూస్‌టుడే:

? నాగాయపల్లి నుంచి పోచమ్మతండా రహదారిని వెంటనే బాగు చేయాలి. వర్షం పడుతుంటే చాలు మట్టి రోడ్డు బురదమయం అవుతుంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – రాజానాయక్, నాగాయపల్లి

✔ కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అవి పూర్తి చేసిన తర్వాత బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం. – పీఆర్ ఏఈ చక్రధర్.

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే:

? యాదగిరిగుట్ట పాత బస్టాండ్ వద్ద ఇటీవల పైపులైను కోసం తవ్విన గుంతతో రహదారి గుంతమయం మారింది. మరమ్మతులు చేపట్టాలి. – శివ, యాదగిరిగుట్ట.

✔ పరిశీలించి, చర్యలు చేపడతాం. – భరత్, ఏఈ, రోడ్లు, భవనాల శాఖ, యాదగిరిగుట్ట.

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం గేటు ఎదుట ఇనుప చువ్వలు తేలి కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ఇనుప చువ్వలు తొలగించాలి. – రవీందర్, బొమ్మలరామారం.

✔ సిబ్బందికి తెలియజేసి వెంటనే గేటు వద్ద ఉన్న ఇనుప చువ్వలు తొలగిస్తాం. – రాజత్రివిక్రమ్, ఎంపీడీవో, బొమ్మలరామారం.

? బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామ ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు ఇసుక మట్టి వచ్చి చేరి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ఇసుకను తొలగించాలి. – వెంకటేశం, చీకటిమామిడి.

✔ గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియ జేసి శుభ్రం చేయిస్తాం. – తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, చీకటిమామిడి

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ధాన్యం కొనుగోలు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, తదితరులు

ఆలేరు, న్యూస్‌టుడే: రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ల విషయమై గురువారం అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి ఆలేరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సన్న రకం ధాన్యం కొనుగోలు కోసం మండలానికి 2-3 కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇప్పటికే 3 లక్షల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచామన్నారు. ఆలేరు ఏఎంసీ ఛైర్ పర్సన్ ఐనాల చైతన్య రెడ్డి, వైస్ ఛైర్మన్ పి.మాదర్‌గౌడ్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం..

ఆలేరు: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు అండగా ఉంటుందని, గీత కార్మికుల కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆబ్కారీ శాఖ పరంగా గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను అందజేసి మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గంలో మొదటి విడతగా 400 మంది గీత కార్మికులకు రక్షక కవచాలు అందిస్తారన్నారు. కాటమయ్య కిట్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు. ఆలేరు ఏఎంసీ ఛైర్ పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.సైదులు, ఆలేరు సీఐ టి.దీపికగౌడ్, ఎస్సైలు విజయ సారథి, నిరోషా పాల్గొన్నారు.

న్యాయస్థానం ఎదుట న్యాయవాదుల ధర్నా



చౌటుప్పల్ న్యాయస్థానం ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: రామన్నపేట సబ్ కోర్టులో చౌటుప్పల్ జ్యూడీషరీని కలుపుతూ విడుదల చేసిన జీవో 78 రద్దు చేయాలని చౌటుప్పల్‌లోని న్యాయస్థానం ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. బార్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎక్కువ కేసులున్న చౌటుప్పల్‌ను కాదని, రామన్నపేటలో సబ్ కోర్టు ఏర్పాటు చేయడం వల్ల కక్షిదారులకు, ప్రజలకు, న్యాయవాదులకు ఇబ్బంది జరుగుతుందన్నారు. చౌటుప్పల్‌ను రామన్నపేట పరిధి నుంచి తొలగించాలని కోరారు. బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి జెల్లా రమేశ్, బాల్యం వెంకటాచలపతి, భిక్షమయ్య, గంగదేవి రవీందర్, రాధాకృష్ణ, వెంకటయ్య, స్వాతి, పరమేశ్, జంగయ్య, ఖయ్యూంపాష, రాఘవేంద్ర, సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహకార సంఘం మాజీ ఛైర్మన్ మృతి

రామన్నపేట: రామన్నపేట సహకార సంఘం మాజీ ఛైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రంగా సంపత్ (70) మృతి చెందారు. గురువారం గుండెపోటు రావటంతో హైదరాబాదులో మృతి చెందారు. ఈయన మృతికి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో భాజపా నాయకులు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పార్టీ సభ్యత్వాలు చేయించారు. యువకులు పార్టీలో చేరడానికి ముందుకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై సభ్యత్వాలు తీసుకుంటున్నట్లు యువకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి అశోక్‌గౌడ్, అధికార ప్రతినిధి మేకల శ్రీనివాస్, నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ, చిలుకూరి రమేశ్, ఆకుల రమేశ్, ఆంజనేయులు, పాండుయాదవ్, రాంచంద్రం, ప్రవీణ్, భిక్షపతి, లక్ష్మయ్య, మురళి పాల్గొన్నారు.

బీబీనగర్: బీబీనగర్‌లో భాజపా మండలశాఖ గురువారం పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించింది. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్, బైపాస్‌లోని వివిధ దుకాణాల్లో సభ్యత్వాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, వంశీగౌడ్‌పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించేలా కృషి

బీబీనగర్, న్యూస్‌టుడే: ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా వాటర్‌మెన్‌లు పని చేయాలని జడ్పీ సీఈవో శోభారాణి అన్నారు. నీటి సహాయకులకు రెండో రోజైన గురువారం బీబీనగర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నీటి నాణ్యతపై అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రశాంత్‌కుమార్, పద్మావతి, రవికిరణ్ పాల్గొన్నారు.

చదువుకు చేయూత

బీబీనగర్: బీబీనగర్ సంజీవయ్య కాలనీకి చెందిన పొట్ట లహరి ఉన్నత చదువుల కోసం టీమ్ పీఎన్‌కే బాసటగా నిలిచారు. జబల్పూర్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన లహరికి రూ.20వేల విలువైన ల్యాప్‌టాప్‌ను టీమ్ పీఎన్‌కే సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో టీమ్ పీఎన్‌కే సభ్యులు పొట్ట నవీన్, మహేష్, భాస్కర్, లింగస్వామి, మహేష్, నరేశ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

యాదగిరిగుట్ట అర్బన్: మండలంలోని కాచారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అదే విధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎప్పటికప్పుడు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ చైతన్య రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

వలిగొండ, న్యూస్‌టుడే: ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ జరిగిన ఘటన మండలంలోని ముద్దాపురం అనుబంధ గ్రామం కొడమర్లబావి వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సోలిపురం నర్సిరెడ్డి, సూదిరెడ్డి నర్సిరెడ్డి ఇంటి ముందు ట్రాక్టర్లను పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసే సరికి బ్యాటరీలు లేకపోవడంతో దొంగలు అపహరించినట్లు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగేందర్ గురువారం తెలిపారు.

మూసీ ప్రక్షాళనతో అభివృద్ధి పరుగులు: ఎమ్మెల్యే



బీబీనగర్ చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, న్యూస్‌టుడే: మూసీ నది ప్రక్షాళనతో పరీవాహక ప్రాంత ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టే మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బీబీనగర్ చెరువులో గురువారం ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ మూసీ నదిని ప్రక్షాళన చేస్తే హైదరాబాద్ ఇంకా వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మూసీ రివర్ బెడ్స్‌పై ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గత బీఆర్‌ఎస్ హయాంలో నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేశారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పింగళ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద అన్నదానం



భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న మాయ దశరథ, నాయకులు కవిత, శ్రీశైలం

రాయగిరి సహృదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాయ దశరథ జన్మదిన వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి దగ్గర, శ్యాంసుందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ జనగాం కవిత, , పట్టణ ప్రధాన కార్యదర్శి రత్నపురం శ్రీశైలం, నాయకులు ఉపేందర్, సంతోష్, మహమ్మద్, మణికంఠ పాల్గొన్నారు.

కరవు భత్యం విడుదల చేయండి

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల దామోదర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు పదివేలకు పెంచి, బీఎడ్ అర్హత కలిగిన ఎస్జీటీలకూ పదోన్నతుల అవకాశం కల్పించి ప్రీ ప్రైమరీ తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రారంభించాలని కోరారు. ఉపాధ్యాయులకు పెండింగ్ కరవు భత్యం, బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మెతుకు సైదులు, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, జి.ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అడ్డగూడూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల దామోదర్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. స్థానిక 14వ వార్డు పరిధిలో శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయం చుట్టూ సిమెంటు రోడ్డును నిర్మించే పనికి ఆయన శంకుస్థాపన గురువారం చేసి మాట్లాడారు. పురపాలిక పరిధిలోని ఇరవై వార్డుల్లో సిమెంటు రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు నిర్మాణం అవుతున్నాయని తెలిపారు. పురపాలిక ఉప ఛైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ సందగళ్ల విజయ, గౌడ సంఘం అధ్యక్షుడు చింతకింది అంజయ్య, మురళి, శ్రీనివాస్, సత్యనారాయణ, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి

యాదగిరిగుట్ట పట్టణం: యాదాద్రి కొండ కింద మొక్కు యాటలు సమర్పించే చోట అన్యమతస్తులతో హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని స్థానికులైన పలువురు గురువారం దేవస్థాన ఈవో భాస్కర్ రావుకు వినతి అందజేశారు. వినతిని అందజేసిన వారిలో అనిల్, ఎం.నర్సింహ, కర్ణ, నవీన్, ప్రశాంత్, ఉన్నారు.

బెల్టు దుకాణంపై పోలీసుల దాడి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నకొండూరు గ్రామంలో బెల్టు దుకాణంపై దాడి చేయగా 10 బీర్లు, 2 మద్యం సీసాలు పట్టుబడినట్టు ఎస్సై కృష్ణమల్ సూర గురువారం తెలిపారు. మద్యాన్ని విక్రయిస్తున్న బెల్టు దుకాణ నిర్వాహకుడు బుచ్చయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

భారీ ర్యాలీ.. అంబేడ్కర్ విగ్రహానికి వినతి



భువనగిరిలో చేపట్టిన ప్రదర్శనలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విధిలేని పరిస్థితుల్లో కళాశాలలను మూసి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం కార్యవర్గ సభ్యుడు దర్పెల్లి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం చేపట్టిన నిరసన ప్రదర్శన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తమ ఫీజు బకాయిలు మంజూరు చేయాలన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.

☛ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ ప్రదర్శనను చేపట్టారు. ప్రదర్శన ప్రధాన రహదారుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు యాకూబ్, మణిపాల్‌రెడ్డి, జహంగీర్, మల్లేశం, సోను, వెంకన్న, మహేందర్, శ్రావణ్, రమేష్, శ్యాంకుమార్, చింతల శివ, రాహుల్ పాల్గొన్నారు.

కళాశాలలు తెరవాలి.. భువనగిరి పట్టణం: ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తెరచి విద్యార్థులకు బోధన కొనసాగించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్పంగ చందు డిమాండ్ చేశారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బినామీలైన ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లుగా ఫీజు బకాయిల విషయమై నిరసన కార్యక్రమాలు చేపట్టని యాజమాన్యాలు నేడు ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మసూద్, ప్రసాద్, పరమేష్, కుమార్, అజ్‌హర్, సిద్దులు, రోహిత్, దినేష్, మహేష్ పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి



ఆలేరు: మండల పరిషత్తు కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుక

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పురపాలక సంఘం కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈ కొండల్‌రావు, ఏఈ మూర్తి, మహ్మద్ షరీఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలేరు: ఆలేరు మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి జరిగింది. ఎంపీడీవో ఎం.సత్యాంజనేయ ప్రసాద్, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. విద్యాకర్, గణేష్, మునయ్య, బాలయ్య, వెంకటేశం, సుధాకర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి చిత్ర పటానికి ఎంపీడీవో రాములు నాయక్ గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు. సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు: అడ్డగూడూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో పి.శంకరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీవో ప్రేమలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుజలాలు అందిస్తే స్వాగతిస్తాం

రాజపేట: ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మూడు నెలల్లో మండలానికి కాళేశ్వరం ద్వారా సాగునీరు అందిస్తే పార్టీ పక్షాన స్వాగతిస్తామని, గాంధీకూడలిలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తామని భారాస మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా మండలానికి సాగునీరు అందించేందుకు భూసేకరణ కూడా జరిగిందని, కొంతమేర కాలువ పనులు జరిగాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆ మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేసి మండలానికి శాశ్వత సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు గుంటి మధుసూదన్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సందిల భాస్కర్ గౌడ్, నర్సింహులు, నర్సిరెడ్డి, జశ్వంత్, వీరేశం, ఉప్పలయ్య, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ విమానం కోసం దాత విరాళం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమానాన్ని స్వర్ణమయం చేసేందుకు హైదరాబాద్ సైదాబాద్‌కు చెందిన దాత కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10,00,116 విరాళాన్ని చెక్కు రూపేణా గురువారం ఆలయ ఈవో భాస్కర్‌రావుకు ఆయన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఆలయ అధికారులు, పూజారులు దాతకు ప్రత్యేక దైవదర్శనం కల్పించి, ఆశీస్సులను అందజేశారు.

ఇద్దరికి సాహితీ పురస్కారాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి (బ్రౌన్ శాస్త్రి) శత జయంతి వేడుకలు ఈ నెల 20న కడప నగరంలోని సీపీ బ్రౌన్ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది 13వ గ్రంథాలయ, సాహితీ సేవా పురస్కారాలను తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన శతావధాన సమ్రాట్ గండ్లూరి దత్తాత్రేయ శర్మకు అందజేయనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు తీవ్ర గాయాలు

వలిగొండ, న్యూస్‌టుడే: టోషన్ వాహనం ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ఇంటర్, పదో తరగతి లోతుకుంట ఆదర్శ పాఠశాల్లో చదువుతున్నారు. పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వస్తుండగా వలిగొండ (తొర్రూర్ క్రాస్ రోడ్డు) వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని టోషన్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

బాలిక అపహరణ.. ఇద్దరి అరెస్టు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: 15 ఏళ్ల బాలిక అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. బాధిత బాలికను సఖీ సంరక్షణ కేంద్రానికి తరలించి ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. భువనగిరి పట్టణంలోని పారిశ్రామికవాడలో ఓ బాలిక అదృశ్యమైనట్లు బాధిత కుటుంబం నాలుగు రోజుల కిత్రం ఫిర్యాదు చేసింది. స్థానికంగా దుకాణం నిర్వహించే ఖాజాఖాన్ అనే వ్యక్తి బాలికను తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఖాజాఖాన్ ఆ బాలికను హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌లో బురాన్‌పాషా అనే బంధువు ఇంట్లో ఉంచినట్లు తెలుసుకున్నారు. బాలికను అక్కడి నుంచి విడిపించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థిపై చేయిచేసుకున్న ప్రిన్సిపల్

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థిపై ప్రిన్సిపల్ చేయిచేసుకున్న ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. మోత్కూరుకు చెందిన శివకుమార్ ప్రైవేటు ఐటీఐలో డీజిల్ మెకానిక్ కోర్సు చదువుతున్నాడు. పదో తరగతి లాంగ్ మెమో ఇవ్వలేదన్న నెపంతో తనను ప్రిన్సిపల్ చితకబాదారని, కర్రతో కొట్టారని, మెమో తెచ్చిస్తానని చెప్పినా తిడుతూ హింసిస్తున్నారని విద్యార్థి శివకుమార్ ఆరోపించారు. ప్రిన్సిపల్‌ని వివరణ కోరగా తాను విద్యార్థిపై చేయిచేసుకోలేదని, లాంగ్ మెమో త్వరగా తెచ్చి ఇవ్వాలని గట్టిగా కోరానని వివరణ ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

ములుగు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. గురువారం వాహనాల తనిఖీలో భాగంగా మండల పరిధిలోని చేబర్తికి వెళ్లగా.. అక్కడ అనుమానాస్పదంగా ఓ టాటా ఏస్ వాహనం వెళ్లటం గమనించామన్నారు. దాన్ని వెంబడించి పట్టుకొని పరిశీలించగా అందులో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు బియ్యాన్ని తరలిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.